# సుపుత్రుడు

చిరుమర్రి లక్ష్మీనారాయణ

"పోస్ట్" అన్న కేక విని బయటకు వచ్చారు వరంధామయ్యగారు. కింద పడేసి పోయిన ఉత్తరాన్ని వంగి చేతిలోకి తీసుకొని వెనకవైపు చూశాడు 'ఎక్కడనుండి వచ్చిందా!' అనుకుంటూ. అక్షరాలు మసకగా కనిపించాయి. 'ముసలితనాన్ని చూసి రోగాలకు,రొష్టులకు అన్నింటికీ లోకువే' అనుకొని కళ్ళజోడు కోసం లోపలికి వెళ్ళాడు.

ఒక చేతితో పడకకుర్చీని, రెండవ చేతితో కళ్ళజోడునీ, దానితో పాటే ఉత్తరాన్నీ పట్టుకొని వరండాలోకి వచ్చి, పడకకుర్చీని వేసి,రెండు చివర్లా కర్రలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకుని, పట్టీని ఒకసారి దులిపి కూర్చున్నాడు.

పడకకుర్చీలో ఎక్కడైనా కూర్చునే ముందు కర్రలు సరిగ్గా ఉన్నాయో లేదోనని చూసుకొని కూర్చోవటం అలవాటు అయింది. ఆయనకు అట్లా అలవాటు అయింది అనేకంటే,ఆయన చిన్న మరదలు అలవాటు చేసింది అనుకోవచ్చు.

పెళ్ళి అయిన కొత్తలో అత్తగారింట్లో ఉన్నప్పుడు ఆయన చిన్న మరదలు ఒకరోజు "బావా, నీవు పడకకుర్చీలో కూర్చోగలవా?" అని అడగటం, తను కూర్చుని, ఒక చివర కర్ర లేకపోవటం వల్ల కింద పడటం జరిగి, అప్పటి నుండి ఎక్కడైనా సరే, పడకకుర్చీలో కూర్చోవాల్సి వస్తే విధిగా రెండు వైపులా కర్రలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకొని కూర్చోవటం పరిపాటి అయింది.

కళ్ళజోడు తీసి పెట్టుకొని ఉత్తరం చింపి చదవసాగాడు. "గౌరవపూజ్యులు నాన్నగార్కి, అమ్మగార్కి రామం నమస్కరించి వ్రాయునది. క్షేమముగా ఉన్నారని అనుకొంటున్నాము. ఈమధ్య ఉత్తరాలు వ్రాయటాన్కి తీరిక ఉండుట లేదు. మీరు అయినా వారాన్కి ఒకసారి వ్రాస్తూ ఉండండి. మీరు డబ్బు పంపమని వ్రాశారు. కాని మీకు తెలియనిది ఏముంది? వచ్చిన జీతం బొటా బొటీగా ఉంది. పంపలేక పోతున్నందుకు క్షమించగలరు.

ఇట్లు
- రామం."

ఒక్కసారి నిట్టూర్చారు వరంధామయ్యగారు. అప్పుడే కిచకిచ మంటూ ఒక మగపిచుక,ఒక ఆడపిచుక ముక్కుతో పట్టుకుని వచ్చిన పురుగుల్ని గూటిలో ఉన్న పిల్లలకు పెట్టటం కనిపించింది. దానితోపాటే మొన్న తుఫానుకు లేచిపోయిన కప్పు, దాని సందుల్లో నుండి పడే సూర్యకాంతి కనిపించాయి. ఆ పక్షులెంతో, ఈ మనుషులూ అంతే అనుకొన్నాడు. తను ఎంత కష్టపడ్డాడు రామున్ని చదివించటానికి!

తండ్రితోపాటే పౌరోహిత్యానికి తనుకూడా వెళుతుండేవాడు. అప్పుడు తనకు మహా ఉంటే పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాలు ఉండేవేమో! తన తాత, తండ్రులు సంపాదించిన ఆస్తులు ఏమీ లేవు. తండ్రి పౌరోహిత్యం మీదనే సంసారం నడవాలి. తనకంటే చిన్నవాళ్ళు అయిన ఇద్దరు చెల్లెళ్ళు, ఒక రోజు బాగుంటే రెండు రోజులు మంచం మీద ఉండే రోగిష్టి తల్లి. పిల్ల లందరి లాగే తనుకూడా ఆ ఊళ్ళో ఉన్న స్కూల్‌లో అయిదవ తరగతి అయిన తరవాత పక్క ఊర్లో ఉన్న హైస్కూలుకు వెళ్ళాలన్న ఉత్సాహంతో ఉన్నాడు. ఎండా కాలం అయిపోయి, ఇంకొక రెండు మూడు రోజులకు బళ్ళు తెరుస్తారనగా తనుకూడా నాన్నను అడిగాడు, హైస్కూలు కెళతానని.

తన మాటకు నాన్న తన వైపు ఒకసారి చూసి దగ్గరకు పిలిచి చేయి పట్టుకుని బయట ఉన్న వేపచెట్టు కిందకు తీసుకెళ్ళి కూర్చోబెట్టి, తనుకూడా నా పక్కనే కూర్చుని-"చూడు, వరం. నా మాటలు నీకు ఇప్పుడు అర్థంకాక, నీకు బాధ అనిపించవచ్చు. అర్థం అయినా, కాకపోయినా రేపటినుండి నీవుకూడా పౌరోహిత్యానికి నాతో రావాల్సి ఉంటుంది" అని బయటకు వెళ్ళిపోయాడు.

తల్లి దగ్గరకెళ్ళి ఏడ్చాడు, స్కూలుకు వెళతానని. "నీకు చదువుకు, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకు కావాల్సినంత డబ్బు మనవద్ద లేదురా- నాన్న చెప్పినట్లు చెయ్యి" అన్నది తల్లి.

తండ్రితోపాటు పౌరోహిత్యానికి వెళుతూనే, కాలచక్రంలో అయిదారు సంవత్సరాలు గడిచిపోవటం, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు అయి అత్తగారిళ్ళకు పోవటం జరిగింది.

ఒక రోజు తండ్రి అన్నాడు- "వరం, నీవు కూడా ఒక ఇంటివాడవు అయితే నాకు దిగుల్లేదురా" అని. తల్లి కూడా ఇంటిపని చేసుకోలేక పోవటం చూసి తను సరే ననటం, ప్రక్కవూరిలో ఉన్న పార్వతితో పెళ్ళి కావటం జరిగిపోయింది.

పార్వతి తన భార్యగా దొరకటం నిజంగా తన అదృష్టమే అనుకోవాలి. ఏ రోజు కూడా తనకు ఇదికావాలి, అది కావాలి అని అడిగి ఎరగదు. ఉన్నదాంట్లోనే సర్దుకుపోయే తత్త్వం ఆమెది.

ఒక రోజు అకస్మాత్తుగా తండ్రికి పక్షవాతం రావటం, కాలు, చేయి పడిపోవటంతో తను ఒక్కడే పౌరోహిత్యానికి వెళ్తుండేవాడు. వచ్చిన దాంట్లోనే మందులకూ మాకులకూ పోను మిగిలిన దాంట్లోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది.

సరిగ్గా ఆ క్లిష్ట పరిస్థితులలోనే రామం కడుపున పడటం జరిగింది. వాడు పుట్టిన రెండు నెలలకు కాబోలు తండ్రి తనని పిలిచి అన్నాడు- "వరం, నీవు నాకు ఒక మాటివ్వాలిరా!" అని.

"ఏమిటి?" అడగమన్నాడు తను.

"అట్లా కాదు. నెరవేర్చుతానన్న మాట..." 'వాగ్దానం' అడిగాడు. తను సరే నన్నాడు.

"రామున్ని పౌరోహిత్యంలో కాకుండా వాణ్ణి చదివించాలి-ఎంత కష్టం అయినా సరే."

తర్వాత కొద్దిరోజులకే తండ్రి పోవటం, ఆ తర్వాత ఆర్నెల్ల లోపలే తల్లి పోవటంతో తను, పార్వతి దిక్కులేని వాళ్ళు అయ్యారు.

ఎండ అనకా, వాన అనకా ఏ వూరు నుండి పౌరోహిత్యానికి పిలుపు వచ్చినా, కష్టమైనా సరే వెళ్ళేవాడు. అప్పట్లో తనకు ఉన్న ధ్యేయం ఒక్కటే. రామున్ని ఎలాగైనా సరే బాగా చదివించాలి-తండ్రికిచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

చదువుకునే అదృష్టం తనకు లేకపోయినా, తన కొడుక్కు అయినా ఉండాలని తను కోరుకున్నాడు. ప్రపంచంలో అందరు తల్లి తండ్రులూ అదే కోరుకుంటారు, తమ బిడ్డలు ఉచ్ఛస్థితిలో ఉండాలని.

దానికి తోడు సహజంగా తెలివి కలవాడు కావటం వల్ల ప్రతి క్లాసు పాసు అవుతూ కాలేజీలో చేరాడు. డిగ్రీ కావటం, అదృష్టవశాత్తూ వెంటనే ఉద్యోగం దొరకటం, వివాహం కావటం కూడా జరిగిపోయింది.

"ఏమండీ! ఒక చుక్క కాఫీ ఇమ్మంటారా! వంట ఈరోజు ఆలస్యం అయ్యేటట్లుంది" అన్న పార్వతి మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు వరంధామయ్య.

"అట్లాగే ఇవ్వు" అని కుర్చీలో నుండి లేచి, ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టి, కళ్ళజోడు తీసి అద్దాలు పంచెతో తుడిచి మరలా పెట్టుకున్నాడు.

"ఏమండీ! వీలు అయినంత తొందరగా ఇల్లు కప్పించకపోతే వర్షాకాలం చాలా కష్టం అవుతుందండీ!" అన్నది కాఫీ కప్పు అందిస్తూ పార్వతి.

"అనే కదా ప్రయత్నం. ఏదీ-డబ్బు అందాలి కదా! ఇదివరకు రోజులా, ఎవర్ని అయినా అడిగితే చెప్పు ఊరికేనే ఇవ్వటానికి? అంతా కాల మహిమ. ప్రతిదీ డబ్బుతో కొలవటం అలవాటు అయిపోయింది."

"అబ్బాయికి ఉత్తరంలో గట్టిగా రాశారా డబ్బు పంపమని? అయినా ఆ కోడలు పిల్లకు ఎక్కడలేని గర్వమూ ను, ఏమి చూసుకొనో

ఆ మిడిసిపాటు! అదే చెప్పి ఉంటుంది పంపవద్దని. లేకపోతే రామం పంపకుండా ఉండడు. అంత తెలివి కలది కనుకనే వీడిని వల్లో వేసుకుంది." మాటల్లోనే కోడలి మీద కసి తీర్చుకుంటున్నది పార్వతి.

"ఎందుకే అనవసరంగా ఆ పిల్లని అంటావు? మన బంగారం మంచిదయితే అనుకోవాలి గాని...వీడికి పంపాలని ఉంటే ఆ పిల్లే అడ్డు పడుతుందా? పంపవద్దు అని పోట్లాడుతుందా?"

"చాల్లెండి- వెనకేసుకు రావటం. ఎంత టక్కులాడి కాకపోతే దమ్మిడీ కట్నం లేకుండా ఉద్యోగం చేసుకొనే వాణ్ణి చూసి వల్లో వేసుకుందీ!" పార్వతి కోపంగా అన్నది.

"ఆ పట్నంలో వాడి కొచ్చే జీతం నిజంగా చాలదు, పార్వతీ! మనం అనవసరంగా వాడికి రాసి లేదనిపించుకున్నాం."

"అంటే వాడు ఉత్తరం రాశాడా? మరి నాకు చెప్పరేమండీ! ఎంత కోపం అయితే మాత్రం వాడు నా కొడుకు కాకపోతాడా? నేను తల్లిని కాకపోతానా? పిచ్చి సన్నాసి-దాంతో ఎట్లా కాపురం చేస్తున్నాడో ఏమో!"

వరంధామయ్య ఇచ్చిన ఉత్తరం చూసి "ఎట్లా అయినా వాడికి మనమీద ప్రేమ ఉందండీ- ఆ కోడలు పిల్లే వీడి మాట సాగనీయదు" అన్నది పార్వతి.

"చూడు, పార్వతీ, నీవు కాపురానికి వచ్చిన రోజులలో అట్లానే చెప్పేదానివా నాకు? 'మీ అమ్మా, నాన్నలను వదలి మన దోవ మనం చూసుకొందాము' అని ఎప్పుడైనా అన్నావా నాతో?" అన్నాడు వరంధామయ్య.

"ఆ కాలపు బుద్ధులు వేరు, ఈ కాలపు బుద్ధులు వేరండీ." పార్వతి అన్నది.

"నీమాట నీది- చెప్పిన మాట వినవుకదా."

"సర్లెండి-మీతో కూర్చుంటే వంట అయినట్లే" అని పార్వతి లోపలికి వెళ్ళిపోయింది.

పుస్తకం తీసి చదువుదామని కళ్ళజోడు పెట్టుకొని పుస్తకం తెరచిన వరంధామయ్య "నమస్కారం, మస్టారూ" అన్న పిలుపుతో తల ఎత్తి చూశాడు.

"కులాసాగా ఉన్నారా, మస్టారూ" అంటూ వచ్చాడు శ్రీధర్.


"ఆఁ...ఆఁ... కులాసానే. ఏమిటి విశేషం? నీ తెలుగు లెక్చరర్ ఉద్యోగం ఎట్లా ఉందీ?" అడిగాడు వరంధామయ్య.


"తెలుగు లెక్చరర్ అన్న మాటే గాని, పిల్లలకు చెప్పే పాఠాలలో మీ దగ్గర నేర్చుకున్న సంస్కృతంలోని ఒక శాతం అయినా ఇప్పుడున్న పాఠ్య పుస్తకాలలో లేవండీ" అన్నాడు శ్రీధర్.

"కాల మహిమ, నాయనా. ఇంకొంత కాలానికి ఈ తెలుగు, సంస్కృత భాషల స్వభావాలే మారిపోయినా ఆశ్చర్యపడవలసిన పని లేదు." బాధగా అన్నాడు వరంధామయ్య.

"శుభవార్త అండీ మీకు. మన రామానికి ఆఫీసరుగా ప్రమోషను వచ్చిందట. నిన్న సాయంత్రం నేను ఇక్కడకు వచ్చేటప్పుడు బస్టాండులో కనపడి చెప్పాడు. కొద్దిరోజులలో మిమ్మలను తీసుకొని వెళ్ళటానికి వస్తాడట."

"మంచిది, నాయనా, చాలా మంచివార్త






చెప్పావు. సంతోషంగా ఉంది" అన్నాడు పరంధామయ్య.

"ఆఁ...నేను వెళ్తానండీ-కొంచెం పని ఉంది" అని శ్రీధర్ వెళ్ళిపోయాడు.

"పార్వతీ!...పార్వతీ...తొందరగా రా- ఒక శుభవార్త."

"వస్తున్నా నండీ..." లోపలి నుండి జవాబు చెప్పింది పార్వతి.

"తొందరగా రమ్మంటుంటే...ఆ పని తర్వాత చేసుకో... ఒకసారి ఇలా రా. తొందరగా...రావాలి."

"అబ్బబ్బా... ఏమిటండీ కొంప లంటుకు పోయినట్లు?"

"రామునికి ప్రమోషన్ వచ్చిందటే- ఇప్పుడే శ్రీధర్ చెప్పి వెళ్ళాడు- అదే అవధాని కొడుకు."

"ఏ శ్రీధరం అండీ? గుర్తు రావటం లేదు."

"వాడేనే! నా దగ్గిర సంస్కృతం నేర్చుకోటానికి వచ్చేవాడే-గుర్తురాలా?"

"ఆఁ...ఆఁ...అవధాని కొడుకు కదూ! ఏమిటట?"

"నిన్న వీడికి రామం కనిపించి చెప్పాడట- కొద్దిరోజులలో వచ్చి మన ఇద్దర్నీ తీసుకెళ్తాడట." పరంధామయ్య ఆనందంతో చెప్తున్నాడు.

"ఆఁ... మీ పిచ్చి కాని ఆ కోడలు పిల్ల పడనిస్తుందా, ఏమన్నానా?"

"ఇదిగో చూడు, పార్వతీ. తాను పట్టిన కుందేటికి మూ డే కాళ్ళు అని నీ మాట నీదే కాని చెప్పేది వినిపించుకోవు గదా!" పరంధామయ్య బాధగా అన్నాడు.

"పక్షులకు ఉన్న జ్ఞానం కూడా మనుషుల్లో లేకుండా పోతున్నది. పిల్లలు ఎగర గలిగే శక్తి వచ్చేంత వరకు అవి ఆహారం తెచ్చి పెడతాయి. రెక్కలు వచ్చి ఎగర గలిగిన రోజున తల్లి పక్షి వాటిని స్వేచ్ఛగా వదిలి వేస్తుందే కాని, ఆపదు. అవి తనకు తిండి పెట్టాలని కోరదు. అట్లానే మనుషులు కూడా అనుకో. మన నమ్మకం ప్రకారం చనిపోయిన తర్వాత పున్నామ నరకం నుండి తప్పుకోటానికే పుత్రుణ్ణి కంటున్నాము. తద్వారా వంశాభివృద్ధి అవుతుం దనుకుంటాము. అవునా!" అన్నాడు పరంధామయ్య.

"అవును, ఆ పున్నామ నరకం ఉందో లేదోకాని, ఈ జన్మలోనే కన్న కొడుకు ఉండి కూడా ఆఖరు దశలో దిక్కులేని వారం అయ్యామే అన్న బాధండీ" అన్నది పార్వతి కళ్ళనీళ్ళు ఒత్తుకుంటూ.

"బాధపడి ప్రయోజనం లేదు. దైవానుగ్రహం ఎట్లా ఉన్నదో అట్లానే జరుగుతుంది. పద, భోజనం వడ్డించు" అని లేచాడు పరంధామయ్య.

×× ×× ××

"పార్వతీ...పార్వతీ...ఎవరొచ్చారో చూడు!"

"ఆఁ...వస్తున్నానండీ..." అంటూ పార్వతి వచ్చి "అరెఁ, రామం, ఎప్పుడు వచ్చావురా? వచ్చే ముందు ఉత్తరం రాయలేక పోయవా?" అన్నది పార్వతి.

"అనుకోకుండా వచ్చానమ్మా! ప్రమోషను వచ్చిన తర్వాత వేరే ఇల్లు మారాము. ఇదివరకు చిన్న ఇంట్లోకి మిమ్ములను తీసుకెళ్తే ఇరుకుగా ఉంటుందని తీసుకెళ్ళలేదు. ఇల్లు మారిన దగ్గరనుండీ మీ కోడలు ఒకటే గోల. వెంటనే మిమ్మల్ని తీసుకొని రమ్మని. బయల్దేరిందాకా నిలువనీయలేదు. ఆఁ... త్వరగా సర్దేయమ్మా కావాల్సిన బట్టలు తీసుకో. తర్వాత నేను వీలుచూసుకొని మిగతా సామాను తీసుకొస్తాను" అన్నాడు రామం.

"చూశారుగా, వీడు నా కొడుకండీ!" అన్నట్లుగా గర్వంగా పరంధామయ్యకే ిసి చూ ిసింది పార్వతి.

రెండవరోజు మధ్యాహ్నానికి రిక్షా దిగుతున్న పరంధామయ్యగార్ని, పార్వతిని, రామన్ని చూ ిసి కోడలు విశాలి ఎదురువచ్చి పార్వతి చేతిలో ఉన్న సంచీ అందుకుంది. ఒకసారి కోడలి ముఖంలోకి చూ ిసి మాట్లాడకుండా ఇంట్లోకి నడిచింది.

రాత్రి భోజనాలూ అవీ అయినతర్వాత పరంధామయ్యగారు, పార్వతి తమకు కేటాయించిన గదిలోకి వెళ్ళిపోయారు.

ప్రయాణ బడలిక వల్ల పార్వతి ముందుగానే నిద్రపోయింది. మధ్య రాత్రిలో మాటలు వినిపించి లేచారు పరంధామయ్యగారు. పక్క గదిలో కొడుకూ, కోడలూ మాట్లాడుకునే మాటలు వినిపిస్తున్నాయి. కొంత సేపు విన్న తర్వాత పార్వతిని మెల్లగా లేపి మాటలు వినమన్నట్లు సెగ చేశాడు.

విశాలి అంటున్నది- "మీరు ఎన్ని అయినా చెప్పండి. నాకు బాధ ఏమీ లేదు. ఓపిక ఉన్నంతవరకు నేను చేసుకుంటాను. అత్తగార్నిమాత్రం విశ్రాంతిగా ఉండనీయండి."

"అదికాదు, విశాలీ, నీవు ఒట్టి మనిషివి కూడా కాదు. నీళ్ళూ అవీ బరువు పనులు చేసుకోలేవు. అమ్మ సాయంగా ఉంటుంది కదా" అన్నాడు.

"అత్తగారి సహాయం కోసం కాదు మిమ్మల్ని ఉన్నపళంగా పంపి తీసుకు రమ్మన్నది. ఈ వయసులో కూడా వాళ్ళకు విశ్రాంతి లేకుండా అక్కడ కష్టపడటం ఎందుకూ అని తీసుకొని రమ్మన్నాను కాని, పని చేయించుకోటానికి కాదు" అన్నది విశాలి.

"సరే, నీకు ఓపిక ఉంటే అట్లాగే చేసుకో" అన్నాడు రామం.

"ఆఁ...మరిచిపోయా- మీ అమ్మగారికి రేపు రెండు చీరెలు తీసుకొని రండి, మర్చిపోకుండా."

"అట్లాగే" అన్నాడు రామం. తర్వాత మాటలేమీ వినిపించలేదు.

తెల్లవారిన తర్వాత కోడల్ని పిలిచి ఆప్యాయంగా అడిగింది పార్వతి- "మనవణ్ణి ఎప్పుడు ఇస్తావమ్మా?" అంటూ.

"అరే! మీకు ఎట్లా తెలుసు? మీ అబ్బాయి చెప్పాడా?" అన్నది విశాలి.

"అవునమ్మా. మొన్న వచ్చినప్పుడు చెప్పాడు" అన్నది పార్వతి రాత్రి విన్న సంభాషణ గుర్తుకు వచ్చి.

కుర్చీలో కూర్చుని కిటికీలో నుండి చూస్తున్న పరంధామయ్య అత్తా కోడళ్ళు నవ్వుకుంటూ పని చేసుకోవటం చూచి హాయిగా నవ్వుకున్నాడు. ●